క్లుప్తంగా

శాస్త్రోక్తంగా ప్రత్యంగిరా భద్రకాళి హోమం


లలితా పీఠంలో హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

సీతంపేట: లలితానగర్ లలితా పీఠంలో అమావాస్య సందర్భంగా బుధవారం ప్రత్యంగిరా భద్రకాళి హోమం నిర్వహించారు. పీఠం దర్బారు హాల్లో పండితుల వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా జరిగిన హోమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ మాట్లాడుతూ భక్తుల కోరిక మేరకు లలితా పీఠంలో ప్రతి అమావాస్య రోజు ప్రత్యంగిరా భద్రకాళి హోమం చేస్తున్నట్టు తెలిపారు. శత్రు నాశనం, ఆర్థిక ఇబ్బందులు తొలగేందుకు, కోర్టు కేసుల్లో విజయం, ఉద్యోగ అభివృద్ధి విషయంలో శుభఫలితాల కోసం ఆది పరాశక్తి ప్రత్యంగిరాదేవి అనుగ్రహం పొందేందుకు ఈ హోమం నిర్వహించినట్టు చెప్పారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

మురళీనగర్: మురళీనగర్ 11 కేవీ ఫీడర్ లైన్ పరిధిలోని ప్రాంతాల్లో ఈ నెల 21న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్ జోన్-11 ఈఈ బి.కె.నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు మురళీనగర్, సెక్టర్-4, బాలభాను స్కూల్ ఏరియా, బర్మా కాలనీ, మసీద్ రోడ్డు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

బాలల సంరక్షణ కేంద్రాల్లో కరోనా నిబంధనలు పాటించాలి


దివ్యాంగ బాలల ఆశ్రమంలో కేసలి అప్పారావు, గొండు సీతారాం

మురళీనగర్: బాలల సంరక్షణ కేంద్రాల్లో కరోనా నిబంధనలు పాటించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు అన్నారు. మాధవధారలోని కేర్ అండ్ లవ్ దివ్యాంగ బాలల ఆశ్రమాన్ని కమిషన్ సభ్యుడు గొండు సీతారాంతో కలిసి బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని బాలల సంరక్షణ కేంద్రాల్లో కరోనా పరీక్షలతోపాటు కచ్చితమైన నిబంధనలు పాటించాలని సూచించారు. ఆశ్రమ నిర్వాహకురాలు హైమాతో మాట్లాడి విద్యార్థి మృతి చెందడానికి కరోనా కారణమా..? లేక అనారోగ్య పరిస్థితులు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు.

మహిళా కార్మికులకు ఈకార్వో వితరణ


పారిశుధ్య కార్మికురాలికి నాప్‌కిన్లు అంది స్తున్న ఈకార్వో ప్రెసిడెంట్ పారిజాత సత్పతి

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే వుమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్(ఈకార్వో) ఆధ్వర్యంలో బుధవారం వితరణ కార్యక్రమం నిర్వహించారు. దొండపర్తిలోని డీఆర్ఎం కార్యాలయం, సమావేశ మందిరంలో కాంట్రాక్టు పారిశుధ్య మహిళా కార్మికులకు శానిటరీ నాప్‌కిన్లను ఈకార్వో ప్రెసిడెంట్ పారిజాత సత్పతి అందించారు. డీఆర్ఎం కార్యాలయం, డాల్ఫిన్ నోస్ కాలనీ ప్రాంతాల్లో పనిచేస్తున్న సుమారు 50 మంది మహిళా కార్మికులకు నాప్‌కిన్లు అందజేసినట్లు ఈకార్వో ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా పారిజాత సత్పతి మాట్లాడుతూ మహిళా కార్మికుల్లో అవగాహన కల్పించి, చైతన్యపరిచేందుకు ఇటువంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. వైస్ ప్రెసిడెంట్స్ కవితా గుప్తా, మధుస్మిత సాహూ, సెక్రటరీ ప్రియంక శ్రీదేవి, జాయింట్ సెక్రటరీ పూజా త్రిపాఠి, సీనియర్ డీసీఎం-2 ప్రీతి రాణా, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

అధ్వానం.. అపరిశుభ్రం


అధ్వానంగా వాటిక లోపలి పరిసరాలు


ఆంధ్రకేసరి నగర్ హిందూ శ్మశానవాటికలో పార్క్‌చేసి ఉన్న క్లాప్ వాహనాలు

- ఆంధ్రకేసరి నగర్ హిందూ శ్మశానవాటిక స్థితి ఘోరం
- క్లాప్ వాహనాలు, డంపర్ బిన్లు, విష సర్పాలకు నిలయం
- పట్టించుకోవాలని స్థానికుల విజ్ఞప్తి

మర్రిపాలెం: జీవీఎంసీ 53వ వార్డు మర్రిపాలెం ఆంధ్రకేసరి నగర్‌లోని హిందూ శ్మశానవాటిక పరిస్థితి అధ్వానంగా తయారైంది. వాటిక లోపలి పరిసరాలు చెత్తాచెదారంతో నిండి ఉండటమే కాకుండా వాహనాల పార్కింగ్‌కు నిలయంగా మారింది. రోజూ వీధుల్లో తిరిగే తడి, పొడి చెత్త సేకరణ క్లాప్ వాహనాలు దాదాపు 30 వరకు ఇక్కడ నిలిచి ఉన్నాయి. మర్రిపాలెం, దాని చుట్టుపక్కల ప్రాంతాలు, ఆర్ అండ్ బీ, అంబేడ్కర్ నగర్, నరేంద్ర నగర్, మహత్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఎవరైనా చనిపోతే దహన సంస్కారాలకు ఈ శ్మశానవాటికకే వస్తారు. నగరంలో ఉన్న వాటితో పోలిస్తే ఇక్కడికి వచ్చేవి తక్కువే. అంతిమయాత్ర వాహనాలు వచ్చాక నగరంలో పెద్ద శ్మశానవాటికలకు మృతదేహాలను తీసుకెళ్తున్నారు. ఈ ప్రాంతంలో ఉన్న శ్మశానవాటికల్లో ఇది కొంచెం పెద్దది. గతంలో దీనిలో మద్యం, గంజాయి తాగడం, ఇతర అసాంఘిక కార్యకలాపాలు జరుగుతూ ఉండేవని కొందరు స్థానికులు చెబుతున్నారు. అప్పట్లో ఈ విషయమై పోలీసులు పలుమార్లు తనిఖీలు కూడా నిర్వహించి కొందరిని పట్టుకున్నారని, నాటి నుంచి అటువంటి కార్యకలాపాలు ఇక్కడ జరగడం లేదని తెలియజేస్తున్నారు.


శ్మశానవాటికలో తుప్పుపట్టిన డంపర్ బిన్లు

ఎన్నో సమస్యలు..

ఈ శ్మశానవాటికలో సుమారు 40 వరకు జీవీఎంసీ డంపర్ బిన్లు పడేశారు. అవి తుప్పుపట్టి నిరుపయోగంగా మారాయి. డంపర్ బిన్లకు తోడు పరిసరాలు అధ్వానంగా ఉండటం వల్ల అక్కడ పాములు చేరుతున్నాయని, రాత్రి పూట విషసర్పాలు సంచరిస్తున్నాయని స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. రాత్రిళ్లు ఇక్కడ లైట్లు వెలగడం లేదని చెబుతున్నారు. గతంలో ఈ శ్మశానవాటిక పరిశుభ్రంగా ఉండేదని, పూల మొక్కలతో పార్కును తలపించేదని పలువురు అంటున్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి శ్మశానవాటికలో వాహనాలు పార్క్ చేయకుండా చూడాలని, కొత్త లైట్లు అమర్చాలని, డంపర్ బిన్లు తొలగించి పరిశుభ్రంగా ఉంచాలని స్థానికులు కోరుతున్నారు.

పరిశుభ్రంగా ఉంచాలి

ఆంధ్రకేసరి నగర్ హిందూ శ్మశానవాటికలో పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూడాలి. శ్మశానవాటికలో ఉన్న క్లాప్ వాహనాలు, డంపర్ బిన్ల వల్ల పాములు వచ్చేస్తున్నాయి. లైట్లు లేకపోవడంతో రాత్రి పూట వెళ్లే పాదచారులు భయపడుతున్నారు. అధికారులు తగు చర్యలు తీసుకోవాలి.
– ప్రసాద్, నరేంద్రనగర్

గడప గడపలో ప్రజాదరణ


అంబేడ్కర్ ఎస్టేట్‌లో మహిళకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న కె.కె.రాజు

కంచరపాలెం: అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి గడప గడపలో విశేష ప్రజాదరణ లభిస్తోందని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. 47వ వార్డు కంచరపాలెం అంబేడ్కర్ ఎస్టేట్, అరుంధతి నగర్ ప్రాంతాల్లో బుధవారం గడప గడపకు కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించారు.కార్పొరేటర్ కంటిపాటు కామేశ్వరితో కలిసి ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ అధికారం చేపట్టిన నాటి నుంచి పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు మొదలు 60 ఏళ్లు దాటిన వృద్ధుల వరకు అన్ని రకాల పథకాలు అందుతున్నాయన్నారు. ఆయనకు అండగా ప్రజలంతా నిలవాలని కోరారు. కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిరణ్‌రాజు, డైరెక్టర్ రాయుడు శ్రీను, వార్డు నాయకులు వసంతల అప్పారావు, సుకుమార్, విజయ్, ముక్క రమణ, సురేష్, కంటిపాము గురువోజీ, సాయి, జయకుమార్, రాఘవులు, అనిల్, చందురెడ్డి, కనకరాజు, కృపా, సాయి, అజయ్, భోగి, శంకర్, వాసు, నరసింగ్, ధనరాజ్, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

చురుగ్గా 'జగనన్నే మా భవిష్యత్తు'


51వ వార్డులోని ఓ ఇంటికి స్టిక్కర్ అతికిస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ


తాటిచెట్లపాలెంలో ప్రభుత్వ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న సచివాలయ కన్వీనర్ గంగామహేష్

మర్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు కళింగనగర్ 289 సచివాలయం పరిధిలో బుధవారం జగనన్నే మా భవిష్యత్తు–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం చురుగ్గా నిర్వహించారు. కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ వలంటీర్లు యమున, యశ్వంత్, కుమారిలతో కలిసి ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను వివరించి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. నివాసుల అనుమతితో ఇంటికి జగనన్న స్టిక్కర్లు అతికించి, సంక్షేమ పథకాల కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మెట్ట దమయంతి, కరిమిరెడ్డి శ్యామ్, రాణి తదితరులు పాల్గొన్నారు.

55వ వార్డులో..

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 55వ వార్డు 245 సచివాలయం పరిధి తాటిచెట్లపాలెంలో సచివాలయ కన్వీనర్ బొడ్డేటి గంగామహేష్ ఆధ్వర్యంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం జరిగింది. సీ–8, సీ–12, సీ–14 క్లస్టర్లలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి బ్రోచర్లు అందించారు. ప్రస్తుత ప్రభుత్వ పనితీరుపై సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో డి.సంతోష్‌కుమార్, శ్రీకాంత్, గృహసారథులు, వలంటీర్లు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

వారణాసికి ప్రత్యేక రైలు సంతోషదాయకం


గంగా పుష్కరాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ జీవీఎల్ నరసింహారావు


వారణాసి రైలు వద్ద బీజేపీ శ్రేణుల సందడి

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వేస్టేషన్‌లో బనారస్(వారణాసి) రైలు ప్రారంభం సందర్భంగా బుధవారం బీజేపీ శ్రేణులు సందడి చేశారు. రైలు బయలుదేరడానికి ముందుగా రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు, పార్టీ శ్రేణులతో కలిసి రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ, రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ సహకారంతో గంగా పుష్కరాల సందర్భంగా విశాఖ నుంచి వారణాసికి ప్రత్యేక రైలు ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. గత పుష్కరాలకు నాటి ప్రభుత్వాలు సరిగ్గా చర్యలు చేపట్టలేదని, వీటిని ముందుగానే గుర్తించిన యూపీ సర్కార్, మోదీ ప్రభుత్వం పుష్కరాలకు వచ్చే యాత్రికులకు ఏ విధమైన అసౌకర్యం కలుగకుండా తగిన ఏర్పాట్లు చేసిందన్నారు. ఈ పుష్కరాలకు ఎక్కువగా తెలుగు రాష్ట్రాల ప్రజలు హాజరవుతారని, వీరికి ఏ ఇబ్బంది లేకుండా వసతి, సదుపాయాలు, సమీప ఆలయాల గురించిన వివరాలతో కరపత్రిక తయారు చేసి, ఆవిష్కరించినట్లు తెలిపారు. ఉత్తరాంధ్ర ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉండే ఈ రైలును రెగ్యులర్‌గా నడపాలని ప్రతిపాదనలు పంపామని జీవీఎల్ చెప్పారు. బుధవారం వారణాసికి బయలుదేరిన రైలులో ప్రయాణికులు, సిబ్బందితో ఆయన మాట్లాడి శుభాకాంక్షలు తెలిపారు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన

మర్రిపాలెం: జోన్–5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ ఆదేశాల మేరకు బుధవారం సింగల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 53వ వార్డు మర్రిపాలెం మెయిన్ రోడ్డు షాపుల్లో, 297 సచివాలయం పరిధి మహరాణి వీధి–1లో సచివాలయ సిబ్బందితో కలిసి శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ తులసీ, సెక్రటరీ పాలవెల్లి తనిఖీలు చేశారు. షాపుల్లో వాడుతున్న ప్లాస్టిక్‌ను స్వయంగా పరిశీలించారు. ప్లాస్టిక్ వాడిన వారిపై జరిమానా విధించారు. పలు షాపుల్లో ట్రేడ్ లైసెన్స్‌లు సరిగ్గా ఉన్నాయో లేదో పరిశీలించారు. షాపుల ముందు ట్విన్ బిన్లు కచ్చితంగా ఉండాలని, తడి, పొడి చెత్త వేరు చేసి వాటిలో వేయాలని వ్యాపారులకు సూచించారు.

క్లాత్ బ్యాగుల వినియోగంతో మేలు


ధర్మానగర్‌లోని పూల దుకాణంలో ప్లాస్టిక్ సంచులను పరిశీలిస్తున్న జెడ్సీ కృష్ణ

కంచరపాలెం: జీవీఎంసీ 55వ వార్డు కంచరపాలెం ధర్మానగర్, తిక్కవానిపాలెం ప్రాంతాల్లో బుధవారం జోన్–5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ పర్యటించారు. దుకాణాల్లో నిషేధిత ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్న వారిపై అపరాధ రుసుం విధించాలని సిబ్బందిని ఆదేశించారు. వార్డులోని దుకాణాల్లో తనిఖీలు నిర్వహించని శానిటరీ సిబ్బంది, సచివాలయ సిబ్బందిపై జెడ్సీ మండిపడ్డారు. కాలుష్య కారక ప్లాస్టిక్‌ను వినియోగిస్తున్న దుకాణ యాజమానులకు క్లాత్ సంచుల వినియోగంపై ఆయన అవగాహన కల్పించారు. వార్డులోని గెడ్డలు, కాలువలు, రహదారులు అధ్వానంగా ఉండటంతో సిబ్బందిపై మండిపడ్డారు. తడి, పొడి చెత్త సేకరణపై వార్డు ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వార్డు కార్యాలయంలో సిబ్బంది రికార్డులను జెడ్సీ పరిశీలించారు.

నైపుణ్యాభివృద్ధితో వ్యక్తిత్వ వికాసం


మాట్లాడుతున్న ఐఆర్ఎస్ డిప్యూటీ డైరెక్టర్ కష్టారావు

మురళీనగర్: నైపుణ్యాభివృద్ధితోనే వ్యక్తిత్వ వికాసం చెందగలరని ఐఆర్ఎస్ డిప్యూటీ డైరెక్టర్, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ జీఎస్‌టీ ఇంటలిజెన్స్ పి.కష్టారావు అన్నారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో క్రమశిక్షణతో మెలగాలని, తమ కలలను చేరుకోవడానికి కష్టపడి చదవాలని సూచించారు. డిప్లొమా విద్యార్థులకు సాంకేతిక నైపుణ్యాలతోపాటు మొత్తం వ్యక్తిత్వ వికాసానికి దోహదపడుతుందన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. కాలేజీ ప్రిన్సిపాల్ జి.వి.సత్యనారాయణ మూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ చలానాల వసూలు


వాహన చోదకుడితో చలనా కట్టిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ రామూర్తి

సీతమ్మధార: ప్రతి ఒక్క వాహన చోదకుడు ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్ ట్రాఫిక్ ఎస్ఐ ఎస్.రామ్మూర్తి తెలిపారు. గురుద్వారా తదితర ప్రాంతాల్లో బుధవారం పెండింగ్ చలానాల వసూలుపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. వాహన చోదకుల వద్ద నుంచి సుమారు రూ.15 వేలు వసూలు చేశారు. నగరానికి చెందిన ఒక వాహన చోదకుడితో 45 పెండింగ్ చలానాలు కట్టించారు. హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహన చోదకులకు అవగాహన కల్పించారు.

ట్రాఫిక్ రూల్స్ అతిక్రమిస్తే చర్యలు


ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అతి వేగంగా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని, మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనానికి సంబంధించి పత్రాలు కచ్చితంగా ఉండాలన్నారు. బైక్‌లకు ఎక్కువ శబ్దం వచ్చే సైలెన్సర్లు వాడకూడదన్నారు. పెండింగ్ చలానాలు ఉంటే వెంటనే చెల్లించాలని సూచించారు. తనిఖీల్లో ఏఎస్ఐ సూర్యనారాయణ, హెచ్‌సీ షేర్ ఆలీ, రామకృష్ణారెడ్డి, మహబూబ్ ఆలీ, రాముడు పాల్గొన్నారు.

'శ్రీనాథుని కాశీఖండం'పై సాహిత్య చర్చ


మాట్లాడుతున్న వెంకట సూర్యనారాయణమూర్తి

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రిజమ్ కళాశాలలో బుధవారం శ్రీనాథుని కాశీఖండం కావ్యంపై చక్కని సాహిత్య చర్చ జరిగింది. ముఖ్య అతిథి సాహితీవేత్త జయంతి వెంకట సూర్యనారాయణమూర్తి మాట్లాడుతూ శ్రీనాథుడు ఈ కావ్యాన్ని స్కంద పురాణంలోని ఒక ఘట్టాన్ని తీసుకుని సర్వజన రంజకంగా రచించారన్నారు. ఇందులో శ్రీనాథుడు కాశీ క్షేత్ర మహత్యం, కాశీ క్షేత్ర విశిష్టత, వింధ్య, మేరు పర్వతముల మధ్య మాత్సర్యం, అగస్త్యుని వృత్తాంతం, శివశర్మ వృత్తాంతం తదితర విషయాలను వివరించారని తెలిపారు. సహృదయ సాహితి అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ 15వ శతాబ్దంలో నివసించిన శ్రీనాథుడు శృంగార నైషధం, కాశీఖండం వంటి గొప్ప కావ్యాలు రచించిన ప్రౌఢకవి అని కొనియాడారు. తిరుమల పెద్దింటి నరసింహాచార్యులు శ్రీనాథుని ప్రౌఢ కవితా విశిష్టత, రచనా విశేషాలను వివరించారు. కార్యక్రమంలో రచయితలు, సాహితీవేత్తలు కె.జి.వేణు, చిట్టిళ్ల నిర్మలాదేవి, రామతాత, డి.వి.సూర్యారావు, కుప్పిలి భీమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం


నక్కవానిపాలెంలో శ్లాబ్‌ను కూల్చివేయిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు


60 ఫీట్ రోడ్డులోని భవనం వద్ద అక్రమ నిర్మాణాన్ని తొలగిస్తున్న సిబ్బంది

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డులో అక్రమ నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ అధికారులు ఉక్కుపాదం మోపారు. ఏసీపీ వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు టీపీఎస్ తేజేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది బుధవారం అనధికారింగా వేసిన శ్లాబ్‌లను తొలగించారు. నక్కవానిపాలెం, 60 ఫీట్ రోడ్డు ప్రాంతాల్లో జోరుగా అక్రమ నిర్మాణాలు జరుగుతుండటంతో అధికారులు ఈ చర్యలు తీసుకున్నారు. మరో రెండు రోజుల్లో అనధికార కట్టడాలను పూర్తిగా తొలగిస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో చైన్‌మెన్ ప్రసన్నకుమార్, వార్డు ప్రణాళిక కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఐ ప్రచారం


అక్కయ్యపాలెంలో ప్రచారం చేస్తున్న సీపీఐ నాయకులు

సీతంపేట: ప్రజల ఆస్తులను కొల్లగొడుతున్న అదానీ, అంబానీల ఆస్తులను జాతీయం చేయాలని లేదా ప్రధాని మోదీ రాజీనామా చేయాలని సీపీఐ నాయకుడు జి.వామనమూర్తి డిమాండ్ చేశారు. సీపీఐ, సీపీఎంల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రచార భేరి కార్యక్రమంలో భాగంగా బుధవారం అక్కయ్యపాలెం మెయిన్ రోడ్‌లో ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వస్తే 100 రోజుల్లో నిత్యావసర వస్తువులు, డీజిల్, పెట్రోల్, గ్యాస్ ధరలు తగ్గిస్తామని ఇచ్చిన హామీ ప్రధాని మోదీ మరిచారని మండిపడ్డారు. పేదలపై ఆర్థిక భారాలు వేసి, కార్పొరేట్ సంస్థలు బ్యాంకుల నుంచి తీసుకున్న అప్పులు మాఫీ చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ తగదని, లేని పక్షంలో ప్రజా, కార్మిక వర్గాల ఆగ్రహానికి మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు రావి కృష్ణ, కేలం శివ, ఎస్.రాము, కె.ఈశ్వరరావు, బి.రమణ, గురునాథ్, చిన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభ పోస్టర్ ఆవిష్కరణ

మురళీనగర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న ప్రచార భేరి కార్యక్రమంలో భాగంగా ఈ నెల 26న కూర్మన్నపాలెంలో జరిగే వామపక్షాల బహిరంగ సభ పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. మాధవధార 48 బస్టాప్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో సీపీఎం నాయకులు బాబు, రాంగోపాల్, శ్రావణ్ సుధాకర్ పాల్గొన్నారు.

వైభవంగా ముత్యమాంబ తొలేళ్ల సంబరం



ప్రత్యేక అలంకరణలో ముత్యమాంబ , అమ్మవారి ప్రతిమలు ఊరేగిస్తున్న భక్తులు

కంచరపాలెం: ముత్యమాంబ అమ్మవారి తొలేళ్ల సంబరం బుధవారం వైభవంగా జరిగింది. గవర కంచరపాలెం గౌరీ యువసేన వెల్ఫేర్ సొసైటీ, గ్రామాభ్యుదయ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పాలమరశెట్టి నగేష్, పీలా అవినాష్ ఆధ్వర్యంలో అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. బుధవారం రాత్రి నగర ప్రాంతాల మీదుగా అమ్మవారి ఉత్సవ ప్రతిమల ఊరేగింపు కనుల పండువగా సాగింది. భక్తులు తలపై ప్రతిమలను మోస్తూ జగదాంబ కూడలి, అల్లిపురం, జ్ఞానాపురం, రామ్మూర్తిపంతులుపేట ప్రాంతాల మీదుగా కంచరపాలెం పుట్టబంగారం అమ్మవారి మూలవిరాట్ వద్దకు చేర్చారు. పలువురు ప్రముఖులు అమ్మవారి ఘటాలను తలపై ఉంచి మొక్కు తీర్చుకున్నారు. పాలకవర్గ సభ్యులు వేగి రమణ, మళ్ల రామకృష్ణ, పి.అప్పారావు, మళ్ల సాంబశివ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు..

ఘటాల ఊరేగింపులో ఒడిశాకు చెందిన బ్యాండ్ సింగారి మేళ, ధూమ్‌ధడాకాలు, తప్పెటగుళ్లు, విజయనగరం పులివేషాలు, వివిధ జంతువుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. అమ్మవారి కీర్తనలు ఆలపిస్తూ ధూపదీప నైవేద్యాలు, సమర్పిస్తూ, ప్రతిమలకు హారతులిస్తూ భక్తులు ముందుకు సాగారు.

నేడు ప్రధాన జాతర

కంచరపాలెం నేతాజీ ఫ్లైఓవర్ కూడలిలో వెలసిన ముత్యమాంబ ఆలయం వద్ద గురువారం ప్రధాన జాతర నిర్వహించన్నారు. దీనికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. భక్తులకు ప్రసాదాలు, మజ్జిగ, శీతల పానీయాలు అందించేందుకు చలివేంద్రాలు సిద్ధం చేశారు. భక్తులు మాస్కులు ధరించి ప్రధాన జాతరకు తరలిరావాలని ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు.

సీపీఎం నాయకుడు కృష్ణమూర్తి కన్నుమూత


కృష్ణమూర్తి(ఫైల్)

ఆరిలోవ: సుదీర్ఘ కాలం పాటు సీపీఎంలో సేవలు అందించిన వి.కృష్ణమూర్తి(67) బుధవారం వేకువజామున కన్నుమూశారు. ఆరిలోవలోని ఆయన నివాసంలో మంగళవారం అర్ధరాత్రి దాటాక గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు విమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వెంటనే కేజీహెచ్‌కు తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరిశీలించే సమయానికే ఆయన మృతి చెందినట్లు వెల్లడించారు. దీంతో కుటుంబ సభ్యులు తిరిగి ఆరిలోవ తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న సీపీఎం, సీపీఐ, వైఎస్సార్‌సీపీ, టీడీపీ నాయకులు పెద్ద సంఖ్యలో చేరుకుని కృష్ణమూర్తి పార్థివదేహానికి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ, కార్పొరేటర్ బి.గంగారావు, సీపీఎం రాష్ట్ర, జిల్లా నాయకులు జగ్గునాయుడు, ఆర్.కె.ఎస్.వి.కుమార్, ఎం.మణి, నరేంద్రకుమార్, శంకరరావు, సూర్యమణి, రంగమ్మ, సీపీఐ జిల్లా నాయకుడు రెహమాన్ తదితరులు అంజలి ఘటించారు. కృష్ణమూర్తికి భార్య అన్నపూర్ణ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కృష్ణమూర్తి ఆలోచనలకు అనుగుణంగా కుటుంబ సభ్యులు ఆయన పార్థివ దేహాన్ని ఆంధ్రా మెడికల్ కళాశాలలో వైద్య విద్యార్థుల పరిశోధనల కోసం అప్పగించారు. ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి నేత్రాలు దానం చేశారు.